అధునాతన సాంకేతిక విద్యకు జీఎన్ఐటీఎస్ మారుపేరు



గోల్కొండ: అధునాతన సాంకేతిక విద్యకు జీఎన్ఐటీఎస్ మారుపేరుగా నిలిచిందని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ జి.రాఘవరెడ్డి అన్నారు. కళాశాల ఆడిటోరియంలో జరిగిన డేటా సైన్స్, మెషిన్ లర్నింగ్ అంతర్జాతీయ సదస్సులో పాల్గొని పరిశోధన పత్రాలు సమర్పించిన వారికి ఆయన ప్రశంస పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ సాంకేతిక సెమినార్‌లకు తమ కళాశాల వేదికగా ఉందని అన్నారు. అంతర్జాతీయ సెమినార్ నిర్వాహకులు తమ కళాశాలను వేదికగా ఎంచుకోవడం తమ కళాశాల ప్రత్యేకతను తెలుపుతుందని అన్నారు.

నేడు హెచ్‌సీయూలో నిరసన

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో స్టూడెంట్స్ యూనియన్ 2023–24 ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలుపుతున్నట్లు అధ్యక్షుడు ఎండీ అతీఖ్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏడు డిమాండ్లతో ఈ నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇటీవల హెచ్‌సీయూలో పనిచేసే ఇద్దరు ఉద్యోగులు మృతి చెందారని, వారి మృతిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుని, మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. ఇద్దరు ఉద్యోగుల కుటుంబాలకు న్యాయం చేసే వరకు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగిస్తామన్నారు.

నేడు సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం



చార్మినార్: మీరాలం మండి మహంకాళేశ్వర దేవాలయం ప్రాంగణంలోని శ్రీ సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణోత్సవాన్ని సోమవారం ఉదయం అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని దేవాలయం కమిటీ ఛైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. ఉదయం ముందుగా సుబ్రహ్మణ్యం స్వామికి అభిషేకం, అర్చన నిర్వహించిన అనంతరం కళ్యాణోత్సవాన్ని నిర్వహించనున్నామన్నారు.

సోలార్ ప్లాంట్ @ 10 ఏళ్లు!



లైబ్రరీ భవనంపై సోలార్ ప్లాంట్

- హెచ్‌సీయూ లైబ్రరీపై పదేళ్ల క్రితం ఏర్పాటు
- క్యాంపస్‌లో మొదటి సౌర విద్యుత్ ప్లాంట్
- దేశంలో సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసిన లైబ్రరీ భవనం కూడా ఇదే

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి ఎంతో చరిత్ర ఉంది. నాణ్యమైన విద్య అందించడంలో జాతీయ, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన విషయం అందరికీ తెలిసిందే. ఇంత ప్రాధాన్యత సంతరించుకున్న తరుణంలో విద్యుత్ వినియోగంలో దశలవారీగా స్వయం సమృద్ధి సాధించాలని నిర్ణయంతో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అనంతరం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో మొదటి సారిగా సౌర విద్యుత్ ప్లాంట్‌ను 2013లో ఏర్పాటు చేశారు. ఇప్పటికీ ఈ ప్లాంట్ విజయవంతంగా కొనసాగుతూ ఆ తర్వాత ఏర్పాటు చేసిన వాటికి మార్గదర్శకంగా మారింది. భారతదేశంలోనే 100 కేడబ్ల్యూ సౌర విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన మొదటి విశ్వవిద్యాలయ లైబ్రరీ కూడా ఇదే కావడం విశేషం.

1.14 మెగా వాట్ల సామర్థ్యంతో..

ఈ సౌర విద్యుత్‌ను క్యాంపస్ లోని ఎంతో ప్రాధాన్యత కలిగిన హెచ్‌సీయూ ఇందిరా గాంధీ మెమోరియల్ లైబ్రరీ భవనంపై రూఫ్‌టాప్ ప్లాంట్‌ను మొదటగా ఏర్పాటు చేశారు. ఈ మొదటి రూఫ్‌టాప్ సౌరవిద్యుత్ ప్లాంట్‌ను అప్పట్లో అప్పటి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రామకృష్ణ రామస్వామి చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రారంభించిన అనంతరం సోలార్ పవర్ ప్లాంట్ కంట్రోల్ రూమ్, రూఫ్‌టాప్ సోలార్ పవర్ ప్లాంట్ ఫలకాలను వీసీ రామకృష్ణరామస్వామి యూనివర్సిటీ అధికారులు, ఫ్యాకల్టీ ప్రతినిధులతో కలిసి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సోలార్ పవర్ ప్లాంట్ 1.14 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేశారు. ఈ సోలార్ పవర్ విద్యుత్ ప్లాంట్‌ను రికార్డు స్థాయిలో కేవలం 30 రోజులలో ఏర్పాటు చేయడం విశేషం.



సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ కంట్రోల్ రూమ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ రామకృష్ణరామస్వామి(ఫైల్)

రూ.14 లక్షల విద్యుత్ బిల్లు ఆదా..

సంవత్సరానికి 21,11,358 కిలో వాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి చేయాలని సంకల్పించారు. ఆ రోజుల్లోనే అంటే పదేళ్ల క్రితమే నెలకు రూ.14 లక్షల వరకు విద్యుత్ బిల్లు తగ్గుతుందని అంచనా వేశారు. క్యాంపస్‌లో లైబ్రరీ భవనాన్ని 1988 అక్టోబర్ 21న అప్పటి భారత ఉపరాష్ట్రపతి డాక్టర్ శంకర్ దయాళ్ శర్మ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం లైబ్రరీకి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పేరు పెట్టారు. లైబ్రరీ తన అంతర్గత కార్యకలాపాలన్నింటినీ కంప్యూటరీకరించిన మొదటి విశ్వవిద్యాలయ లైబ్రరీ. భారతదేశంలో ఎలక్ట్రానిక్ జర్నల్‌లు, డేటాబేస్‌లకు సభ్యత్వాన్ని పొందింది. పదేళ్లు గడిచినా ఇప్పటికీ విజయవంతంగా ఈ ప్లాంట్ కొనసాగడం విశేషం. ఇదిలా వుండగా ఆ తర్వాత మరిన్ని చోట్లకు విస్తరించే చర్యలు క్యాంపస్‌లో చేపట్టి కూడా విజయవంతమయ్యారు. రాబోయే రోజుల్లో పూర్తి స్థాయిలో సోలార్ పవర్‌పైనే ఆధారపడాలని కూడా ప్రణాళికలతో ముందుకు సాగుతుందని ఆశిద్దాం.

స్పీకర్‌కు శుభాకాంక్షలు



స్పీకర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు నరేందర్

శంషాబాద్: తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు స్థానిక కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా లమ్‌హే వేడుకలు



శంషాబాద్: ఐసీఎంబీ బిజినెస్‌స్కూల్ విద్యార్థుల ఫ్రెషర్స్, ఫేర్‌వెల్ డే వేడుకలు ఆదివారం సాయంత్రం పట్టణంలోని తనిష్క్ కన్వెన్షన్‌లో ఉత్సాహంగా జరిగాయి. అత్తాపూర్ ఐసీఎంబీ బిజినెస్ స్కూల్ విద్యార్థులు లమ్‌హే–23 పేరిట నిర్వహించిన ఈ వేడుకల్లో సినీనటి శ్రవంతి పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఫ్యాషన్‌షో, క్యాట్ వాక్, నృత్యాలు చేసి ఔరా అనిపించారు.

నూతన అసోసియేషన్ ఏర్పాటు



రాజేంద్రనగర్: బుద్వేల్ బన్సీలాల్‌నగర్‌లో ఆదివారం బన్సీలాల్‌నగర్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులుగా పి.మోహన్, ఉపాధ్యక్షులుగా దేవేందర్ వర్మ, జనరల్ సెక్రటరీగా సాయి మల్లిక్, కోశాధికారిగా రవి కుమార్, జాయింట్ సెక్రటరీగా సి.యాదయ్య, భాస్కర్, ఆర్గనైజింగ్ సభ్యులుగా చంద్రశేఖర్, అశ్వక్, సతీష్, వికాస్, దినేశ్, రాహుల్, సలహాదారులుగా సి.నాగరాజు, డి.రాజు, నాగమ్మ, కృష్ణ కుమార్, ఎన్నికయ్యారు.

రాజీనామా తిరస్కరణ

మణికొండ: ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షత స్థానానికి సీతారాం దూళిపాల చేసిన రాజీనామాను కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా తిరస్కరించారు. ఆదివారం మణికొండ మున్సిపాలిటీ, ఎంప్లాయిస్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ప్రధాన కార్యదర్శి వి.ఆంజనేయులు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్ష స్థానానికి రాజీనామా చేసిన పరిణామాలను తెలుసుకున్నారు. అవన్నీ పెద్ద కారణాలు కావని, అధ్యక్షునిగా అతన్నే కొనసాగాలని సభ్యులంతా కోరారు. దాంతో ఆయన అంగీకరించారు. త్వరలోనే మరో సమావేశం ఏర్పాటు చేసి స్థానిక సమస్యల పరిష్కారాణానికి కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి బాబురావు, కార్యవర్గ సభ్యులు, పలు కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉత్తమ విద్య అందించాలి





సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌సీయూ ఉపకులపతి జగదీశ్వర్‌రావు, కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యావేత్తలు తదితరులు

బండ్లగూడ: విద్యార్థులకు ఉత్తమ విద్యాబుద్ధులు నేర్పిస్తు వారు విజ్ఞానవంతులుగా ఎదిగేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని హైదరాబాద్ హెచ్‌సీయూ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి బి.జగదీశ్వర్ రావు అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ శ్రీ శారదాధామంలోని శ్రీ సరస్వతీ విద్యాపీఠంలో జాతీయ విద్యా విధానంపై ఆదివారం సెమీనార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ హెచ్‌సీయూ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి బి.జగదీశ్వర్‌రావు హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా రంగంలో సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, అధికారులను భాగస్వామ్యం చేయడం అభినందనీయమన్నారు. జాతీయ విద్యావిధానం ద్వారా నూతన సాంకేతిక ప్రగతిని, రాబోవుతరానికి అందించి తన ప్రగతికి తానే బాటలు వేసుకునే విధంగా అవకాశం కల్పించడబడిందన్నారు. చక్కటి పౌరులుగా తీర్చిదిద్ద దానికి జాతీయ విధానం మార్గం సుగమము చేస్తుందన్నారు. జాతీయ విలువలను పెంపొందించి, జాతీయ పౌరసత్వాన్ని అభివృద్ధి పరిచి ఒక పటిష్టమైన దేశంగా రూపాంతరం చెందడానికి, భారత యువతకు కావలసిన నైపుణ్యాలను వ్యక్తిత్వ విలువలను పెంపొందించే దిశగా జాతీయ విద్యా విధానం రూపొందించబడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ఎల్‌యూ(రిటైర్డ్) ప్రొఫెసర్ సుధాకర్, తిరుపతి రావు, డాక్టర్ చామర్తి ఉమామహేశ్వరరావు, శ్రీ సరస్వతీ పతకమూరి శ్రీనివాసరావు, ముక్కాల సీతారాములు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్స్ డే

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్‌లోని పూర్ణ గార్డెన్‌లో పెన్షనర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి తమ విధులను నిర్వహించి రిటైర్‌మెంట్ తీసుకున్న తరువాత కూడా వారు పని చేసేందుకు ఆసక్తి చూపడం అభినందనీయమన్నారు. రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారు చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎందరికో ఆదర్శవంతంగా నిలుస్తున్నాయన్నారు. అసోసియేషన్‌కు తనవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్, కార్పొరేటర్లు ప్రశాంత్‌నాయక్, కంటెస్టెడ్ కార్పొరేటర్ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు గోపాల్‌దిరాజ్, సంగారెడ్డి, నర్సింహ్మగౌడ్, శంకర్‌ముదిరాజ్, అసోసియేషన్ అధ్యక్షులు రాంచందర్‌రావు, వైస్ ప్రెసిడెంట్ రాంచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మహేందర్‌గౌడ్, రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు తదితరులు

పర్యాటకులతో గోల్కొండ కిటకిట..



గోల్కొండ: గోల్కొండ కోటకు పర్యాటకులు అధికసంఖ్యలో వచ్చారు. ఆదివారం సెలవు రోజు కావడంతో వేల సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు కోటకు వచ్చారు. భారీ సంఖ్యలో వచ్చిన పర్యాటకులతో గోల్కొండ బుకింగ్ కౌంటర్ వద్ద భారీ క్యూ ఏర్పడింది. గోల్కొండ ఎంట్రెన్స్ గేట్ వద్ద చెకింగ్ పాయింట్ వద్ద భారీగా మహిళలు బారులు తీరారు. కోటలోని నగీనాబాగ్‌లో గల సైనికుల గదులను పర్యాటకులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. కోటలోని రాణిమహల్, అక్కన్నమాదన్న కార్యాలయం చూడడానికి పర్యాటకులు క్యూ కట్ట వలసి వచ్చింది. రాణిమహల్ ప్రాంగణంలో గల ఫౌంటెన్ అందాలను చూస్తే పలువురు పర్యాటకులు ఆశ్చర్యపోయారు. పిల్లలు, పెద్దలు, కోట పై భాగంలో మెట్ల వద్ద సందడి చేస్తూ సెల్ఫీలు దిగారు. కాగా భారీ సంఖ్యలో తరలివచ్చిన పర్యాటకులతో గోల్కొండ కోట ముందు ఉన్న రెస్టారెంట్లు అన్ని కిటకిటలాడాయి. పలు హోటళ్లల్లో బిర్యానీతో పాటు టీ, సమోసాలు హాట్ కేకులుగా అమ్ముడుపోయాయి.

18న స్పీకర్‌కు పురస్కారం ప్రదానం


గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఈ నెల 18వ తేదీన రవీంద్రభారతిలో శృతిలయ ఆర్ట్స్ అకాడమి, సీల్‌వెల్ కార్పొరేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ప్రైడ్ ఆఫ్ తెలంగాణ పురస్కారాన్ని అందజేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కొండా సురేఖ, సీతక్క, సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావులతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

ఐలమ్మ స్ఫూర్తితో పోరాడాలి



మాట్లాడుతున్న కుమారస్వామి

రాయదుర్గం: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ స్ఫూర్తితో రజకులు ఆత్మగౌరవంతో జీవిస్తూ, మన హక్కుల కోసం పోరాడి సాధించుకోవాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుంద్రకుమారస్వామి పేర్కొన్నారు. బొటానికల్ గార్డెన్‌లో శ్రీరామ రజక సంఘం ఆధ్వర్యంలో పానుగోటి సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన రజక సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రజకుల అభ్యున్నతికోసం జాతీయ బీసీ దళ్ ఎప్పటి నుంచో కృషి చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కుల వృత్తినే నమ్ముకున్న అనేక రజక కుటుంబాలు తమ రెక్కల కష్టం మీదే జీవనం సాగిస్తున్నాయన్నారు. ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా రజకులు కూడా ఆర్థిక, రాజకీయంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, సందీప్, లక్ష్మణ్, జానీ, వెంకన్న, ధర్మ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



22 నుంచి రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు



గన్‌ఫౌండ్రీ: డిసెంబర్ 22వ తేదీ నుంచి మల్లేపల్లిలో దివంగత సయ్యద్ యూసుఫ్ అలీ పహిల్వాన్ జ్ఞాపకార్థం రెజ్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు నాసర్, కులకి తెలిపారు. ఆదివారం బషీర్‌బాగ్‌లో రెజ్లింగ్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. డిసెంబర్ 22 నుంచి 24 వరకు మల్లేపల్లి పనిగ్రౌండ్‌లో కుస్తీపోటీలు జరుగుతాయని యూసుఫ్ అలీ కేసరి టైటిల్ 75 కేజీల నుంచి 100 కేజీల విభాగంలో గెలుపొందినవారికి మెడల్, ట్రాక్‌షాట్ అందివ్వనున్నట్లు తెలిపారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు



శ్రీకాంత్‌చారికి బహుమతి అందిస్తున్న అంజుమ్‌బాబుఖాన్

గోల్కొండ: ఉత్తమ సేవలకు గుర్తింపు ఎప్పుడూ ఉంటుందని గ్లెండల్ అకాడమీ ఇంటర్నేషనల్ స్కూల్ ఫౌండర్ అంజుమ్‌బాబుఖాన్ అన్నారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆమె అడ్మిన్ విభాగం ఉద్యోగి బొమ్మల శ్రీకాంత్‌చారికు ఉత్తమ సర్వీస్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత దశాబ్ద కాలంలో క్రమ శిక్షణతో పని చేస్తూ తోటి ఉద్యోగుల్లో ఉత్సాహం నింపిన ఉద్యోగిగా శ్రీకాంత్‌చారికి మంచి పేరు ఉందని అన్నారు.

నాలాలను వదలని అక్రమార్కులు

మణికొండలో బుల్కాపూర్ నాలాల ఆక్రమణ

- పట్టించుకోని అధికారులు



బుల్కాపూర్ నాలా పక్కనున్న స్మశానాలను తొలగించే యత్నం చేసిన అక్రమార్కులు



బుల్కాపూర్ నాలాలో మట్టిపోసి ఆక్రమణలకు పాల్పడుతన్న నిర్మాణదారులు

మణికొండ: అది అనాదిగా ఉన్న బుల్కాపూర్ నాలా...వర్షాలు కురిసినపుడు పై ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు అందులో చేరి లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా కాపాడుతుంది. గతంలో అయితే ఏకంగా బుల్కాపూర్ నుంచి హుస్సేన్‌సాగర్‌కు వరదను తీసుకెళ్లేది. అలాంటి కాలువను పరిరక్షించేందుకు అధికారులు, ప్రభుత్వాలు ఓవైపు కోట్లాది రూపాయలు ఖర్చుచేసి పునరుద్ధరించే పనులను చేపడుతుండగా మరో వైపు కొందరు వాటిని ఆక్రమణలకు గురిచేస్తున్నారు. ఆక్రమణలను అడ్డుకోవాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చూసిచూడనట్లు ఉండటం వల్ల నాలాలను ఆక్రమించి నిర్మాణాలు వెలుస్తున్నాయి. మణికొండ మున్సిపాలిటీ కేంద్రం లోని మర్రిచెట్టు కూడలి నుంచి మల్లన్న దేవాలయం వరకు ఉన్న బుల్కాపూర్ నాలా ఇప్పటికే పలు చోట్ల ఆక్రమణలకు గురయ్యింది. గమనించిన స్థానికులు ఇదేమిటని ప్రశ్నించటంతో ఎట్టకేలకు ఆదివారం పనులను నిలిపివేశారు. నాలాను ఆనుకుని ఉన్న లక్ష్మీనగర్ కాలనీ లే అవుట్‌లో ఓవైపు రోడ్లను చూపగా కొందరు నాలాపై వంతెనలను నిర్మించుకుని దారులను చేసుకున్నారు. తాము కొనుగోలు చేసిన ప్లాటు సైజులు ఒకలా ఉంటే దాన్ని నాలా వైపు జరిగి ఇష్టారాజ్యంగా కబ్జాలకు పాల్పడినా, అధికార యంత్రాంగం పట్టించుకోవటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

స్మశానాలను వదలని అక్రమార్కులు...

బుల్కాపూర్ నాలాకు ఆనుకుని అనాదిగా గ్రామానికి చెందిన పలు కులాల వారు వారి పూర్వీకుల సమాధులను ఏర్పాటు చేసుకున్నారు. వాటిని ఆనుకుని ప్లాట్లను కొనుగోలు చేసిన వారు క్రమంగా వాటిని ఆక్రమించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదివారం మంచిరేవుల వంశస్తులకు చెందిన స్మశానాలను తొలగించే యత్నం చేయటంతో వారు అడ్డుకున్నారు. దాంతో మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎం.రాఘవరెడ్డి వారిపై రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇకనైనా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు బుల్కాపూర్ నాలా ఆక్రమణలను తొలగించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేదంటే జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి వరకు ఫిర్యాదులు చేస్తామని పేర్కొన్నారు.

సంక్షేమ సంఘం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు



సీనియర్ సిటీజన్స్ సంక్షేమ నూతన సభ్యులు

రాజేంద్రనగర్: భవానీనగర్ సీనియర్ సిటీజన్స్ సంక్షేమ సంఘం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్, రంగారెడ్డి అసోసియేషన్‌కి సంబంధించిన రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మధుసూదన్ రావు, జిల్లా అధ్యక్షులు పి.ప్రతాప్ రెడ్డి, సత్తయ్య గౌడ్, ఎం.అమృత రెడ్డి, ఎం.సాంబశివ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభ్యులతో కలిసి రాజేంద్రనగర్ మండల సీనియర్ సిటీజన్స్ సంక్షేమ సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షులుగా కె.నర్సింహా గౌడ్, ఉపాధ్యక్షులుగా డి.రమేశ్, జాయింట్ సెక్రటరీగా వి.వెంకటేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గయాసూర్ రహమాన్, ప్రధాన కార్యదర్శిగా ఎ. అమర్ సింగ్, కోశాధికారిగా పి.మోహన్ రావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా కె. రామారావు, పి. జీవన్ దాస్, డి. గాంధీ, కె. నర్సింహా, భాషా, లక్ష్మారెడ్డి, గౌరవ అధ్యక్షులుగా వేము వందనం బి.పరమేశ్వర్, సలహాదారులుగా ఎ. సత్యనారాయణ రెడ్డి, సి. బాల్‌రాజ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు, వయోవృద్ధుల కష్టాలు, నివారణ మార్గాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటీజన్స్ తదితరులు పాల్గొన్నారు.